

# గణగణ గంటలు మోగెను...

ఆ రోజు మా ఇస్కూలు తురాయి చెట్లు మా వంక చూసి దిగులుగా మొకాలు పెట్టినాయి.

మేము కనపడంగానే గలగలమంటా ఆకులు కదిలించే కానుగచెట్లు మూగెద్దుల్లాగా నిలబడిపోయినాయి. గేటుకాడుండే బండి ఖాసీము మా బుజాలను భరోసాగా చరస్తా చొచ్చొచ్చొ అని పెదాలు యిరిచినాడు.

అయన్నీ చూసి ఏందిరా స్వామా శకునాలు యిట్టా ఉన్నాయి అనుకుంటా లోపలికి పోయేసరికి ఏముంది... బీకరమైన న్యూసు! టెన్తు కిలాసు పరీక్షల డేటు ఇచ్చేసున్నారు!!

అంతకు ముందురోజు రేడియోల్లో చెప్పినారంట. మేము యిన్లేదు.

పొద్దున పేపర్లలో రాసినారంట. మేము చూళ్లేదు.

మాబోటోళ్ల కోసరమే మేము పోయేపాటికి కుమారస్వామి ఐవోరు నీటుగా నోటీసు బోర్డులో రాపిచ్చి పెట్టున్నాడా సంగతిని. పిలకాయలంతా ఆణ్ణే మూగున్నారు చల్లగా చమటలు పట్టి.

నేను కూడా ఆ గుంపులోకి దూరి తొంగి తొంగి చూస్తా 'మామా. రోజులు దాపురించి నాయి గదరా' అన్నాను నూతిలో పడ్డోడిలాగా లోగొంతుతో.

'అవును మామా. మనకి పోయేకాలం వొచ్చేసిందిరా' అన్నాడు కాండూరి మురళీ గాడు.

'చూడాల్సిన సినిమాలు ఏవైనా ఉంటే ఇప్పుడే చూసేసుకుంటే బెటరురా. తర్వాత పంపరురా' అన్నాడు కేతిరెడ్డి శ్రీదరుగాడు.

'నోట్సుల్లో గ్యాపులు గబగబా ఫిలపు చేసుకొని ప్రిపరేషను హాలిడేస్‌కల్లా బయట పడాలిరా' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

అందరం పొడుగ్గా గాలి వొదిలినాం.

మా మనసులు ఎట్టెట్నో అయిపోయినాయి. గెంటకొట్టే బాషా ఫస్టు బెల్లు కొడతా ఉంటే మా గుండెలు గణగణా అంటా ఉన్నాయి.

'ప్రెయిరు ఎగనూకి కాసేపు యాడైనా కూచుందామురా. నా మనసేమీ బాగా లేదు రా' అన్నాను వాళ్లతో.

'అవునురా. నాక్కూడా ఏందో బయం బయంగా ఉందిరా' అన్నాడు కాండూరి మురళీగాడు.

నలుగురం ప్రెయరు ఎగ్గొట్టి జలదంకి రోడ్డు మీద కాస్త పైకి పోయి దూరంగా గట్టు మీద కూచున్నాం. కాసేపటి దాకా ఎవరం ఏమీ మాట్లాడుకోలా.

నేనన్నాను– 'ఒరే... పబ్లిక్ పరీక్షల టయము యింత గబాల్న వొస్తుందని అనుకోలేదురా. మనల్ని మనం ప్రూవు చేసుకోవాల్సిన రోజు వొచ్చేసినట్టేరా. మన అమ్మలకీ నాయనలకీ యింక నిద్దర్లు పట్టవు. పైకి అవుపించరుగానీ మనం ఏ విదంగా చదువులు చదివి ఈ టెన్తు గట్టెక్కుతామో అని వాళ్లు అన్నాలు కూడా మానేస్తారా' అన్నాను.

'అవునురా. గుంటూరులో ఉన్న మా నాయన నా కోసమే లీవులన్నీ పేరబెట్టుకుంటూ ఉన్నాడంట పరీక్షల టైముకి వచ్చి నాకు తోడుగా ఉండేదానికి. మొన్న జాబు రాసినాడు– మురళయ్యా... నీకేం కావాలో అడగరా వొస్తా వొస్తా తెచ్చిపెడతా. నువ్వు మాత్రం బాగా చదివి పెద్ద మార్కులతో టెన్తు ప్యాసు కావాలి చిన్నా... అని. గుర్తుకొస్తే బలే దుక్కంగా అనిపిస్తా ఉంది. ఎయితో నైన్తో అయితే ప్యాసా ఫెయిలా అనే దిగులుబల్లా. టెన్తులో అట్ట కాదు గదరా. ఒక్క సబ్జెక్టు పోయినా సంవచ్చరం వృదా. పైగా ఫ్రెండ్సంతా మనల్ని దాటి ఇంటరులోకి ఎళ్లిపోతారు' అన్నాడు మురళీగాడు.

వాడి మొకం నా మొకం కంటే బాగా కళ తప్పిపోయింది. ఇద్దరం బెదురుబెదురుగా ఉన్నాం.

అది చూసి–'ఒరే.. మీరు అన్ నెససరీగా వర్రీ అవతా ఉన్నారురా' అన్నాడు కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు.

'అవునురా. ఇంకా పరీక్షలకి చాలా టయం ఉంది. హాల్‌టికెట్లు రాలా. టైమ్ టేబులూ రాల. డేటే కదా వొచ్చింది. ఇప్పట్నించి మొదలుబెట్టినా అప్పటికి ఎల్లికొల్లరా. బాగా రాయొచ్చురా పరీక్షలనీ' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

'మీకేమిరా ఎన్నయినా చెప్తారు. కానీ నాకు లెక్కలు, ఇంగిలీషు డౌటురా. తక్కినవాట

న్నింటి లాగిస్తానుగానీ లెక్కలు పేపరు చూడంగానే తలకాయ తిరుగుతుంది మామా' అన్నాను నేను.

'నా పరిస్థితి కూడా సేమ్‌రా. కాకుంటే సైన్సులో. అది కూడా కెమిస్ట్రీలో. ఆ పాస్ఫ రసు, సల్ఫరు పరమాణు యిన్యాసాలే పీడకలల్లా వొస్తా ఉన్నాయిరా. ఎన్నిసార్లు బట్టీకొట్టినా పీరియాడికల్ టేబులు రావడం లేదురా. అదొక్కటే నా డౌటురా' అన్నాడు మురళీగాడు.

శ్రీదరుగాడు మాలకొండరావుగాడు మొకామొకాలు చూసుకున్నారు. ఉన్నంతలో అన్ని సబ్జెక్టులలో వాళ్లిద్దరే మినిమము గ్యారంటీగా ఉన్నారు. అయితే వాళ్లిద్దరికి కూడా గండాలు ఉన్నాయి.

శ్రీదరుగాడి చేతిరాత పరమ అన్యాలం. వాడి రాతకి 'కోడిరాత' అని పేరు పెట్టినామని కోళ్లకి గనక తెలిస్తే అయన్నీ ఉన్నపళంగా పోయి దబేలుమని బాయిలో పడి సస్తాయి. అంత అవమానం. అన్సర్లన్నీ సూపరుగా కరెక్టే. కానీ అర్దం అయితే గదా. పేపర్లు దిద్దేవాడు ఆ రోజు గనక టిఫెనులో కారం ఎక్కువ తినొచ్చాడా ఈడి రైటింగు అర్దంగాక దెబ్బకి తిక్క రేగి మొత్తం కొట్టి పార్నూకుతాడు.

ఇంక మాలకొండరావుగాడి చేతిరాత ముత్యాల్లాగా ఉంటుందిగానీ వాడికి చెమట రోగం. ఒక చేత్తో రాస్తా ఉంటే ఇంకో చేత్తో చెమట కారతా ఉంటుంది. అంతా పూర్తయ్యేటప్పటికి ఆన్సరు పేపరు నీళ్ల బకెట్టులో ముంచి తీసినట్టుగా ఉంటుంది. దిద్దేవాడికి ఓపిక ఉంటే తప్ప వాడు ప్యాసుగావడం కష్టం.

ఆ సంగతే చెప్పి 'మరి మేము కూడా బయపడాలి గదరా. మాక్కూడా రిస్కు ఉన్నట్టే గదరా' అన్నారు వాళ్లిద్దరూ.

నలుగురం మళ్లా గమ్మునైపోయినాం.

ఆకరులో శ్రీదరుగాడే అన్నాడు. 'ఒరే మనం ఒకరికి అపకారం చేసిందీలా. ఒకర్ని దొంగదెబ్బ తీసిందీలా. ఒకరి మీద చెడు చెప్పలా. ఒకరి కాడ చెడు యినలా. దేవుడు మనకి అన్యాలం చేయడురా. మనందరం ప్యాసుగావడం ఖాయంరా. నన్ను నమ్మండిరా' అన్నాడు.

వాడు ఆ మాటలు ఎంత బాగా చెప్పినాడంటే మా అందరి మొకాల్లో నవ్వు వొచ్చేసింది.

'అబ్బ కరెక్టు మాట చెప్పినావురా. మనం ఏ పాపం చెయ్యలేదురా. మాలకొండరావుగాణ్ణి ఒకసారి బజారుబంతిలో కావాలని తుక్కుపగల కొట్టినానుగానీ అది పెద్దగా పాపం కిందకి రాదురా. నువ్వు చెప్పినాక దైర్నం వొచ్చిందిరా. యియ్యాల్టి నుంచి అదరగొడదాం పదండిరా' అని లేచినాను నేను.

నలుగురం చేతులు చేతులు పట్టుకొని ఇస్కూల్లోకి పోతా ఉంటే శెట్టిగార్ల పిల్లోడు మెంటా మదుగాడు ఎదురుపడినాడు. మనిషి సోదీనంలో లేడు.

మమల్ని చూస్తానే-

'హే రామ్.. జబ్ జబ్ పూలు కిలే...' అన్నాడు.

మాకు గాబరా పుట్టింది. సామాన్యంగా వాడు హిందీ మాట్లాడడు. 'ఏమిరా మదుగా.

నోటీసు బోర్డు చూసినావంటరా... డేటుకే అంత యిదైపోతే ఎట్టరా. అధైర్యపడబాకరా. రే మాటరా' అని పిలస్తా ఉన్నా పట్టించుకోకుండా-

'మంగమ్మా నువ్వు ఉతుకుతుంటే అందం...

అబ్బ వేశావు బందం' అని పాడుకుంటా ఎళ్లిపోయినాడు.

'పాపం. షాకులో ఉన్నాడురా' అన్నాను నేను.

'అవున్రా. మొకాన నీళ్లు కొట్టినా బాగుండేది గదరా' అన్నాడు కందులుగాడు.

'పాడుకొని పాడుకొని కాసేపటికి వచ్చేస్తాడు పదండిరా' అన్నాడు మురళీగాడు.

ఇస్కూలుకు వొచ్చేసరికి టెన్తు ఎ, టెన్తు బి, టెన్తు సి సెక్షన్లు సచ్చిన శవాల్లా ఉన్నాయి. పరీక్షల డేటు వొచ్చిన బయంలో పిలకాయలు కుక్కిన పేనుల్లా ఉంటే ఐవోర్లు దొరికిందే సందుగా లెక్చర్లు దంచతా ఉన్నారు.

మా సెక్షనులో ఫస్టు పిరీడు చెప్తా ఉన్న సి.సుదాకర్ ఐవోరు పాపం మా కంటే ఎక్కువగా గాబరా పడటం మొదలుబెట్టినాడు.

'ఒరే.. మీరేం కంగారు పడబాకండి. ఫిజిక్సు కెమిస్ట్రీ సిలబసు అంతా నీటుగా చెప్పేసున్నా. నోట్సులు కూడా యిచ్చేసున్నా. ఇంపార్టెంటు కొసెన్లు కూడా నోటు చేసి ఇస్తా. అయి చదువుకోండి. ఒకటి గుర్తు పెట్టుకోండి. పిలకాయలని ఎట్టాగైనా ఫెయిలు చేసి తీరాల్సిందే అనుకొని ఎవ్వరూ పేపర్లు తయారు చెయ్యరు. మెయిన్ పేపరు టఫ్ఫుగా ఉంటే బిట్ పేపరు ఈజీగా ఉంటుంది. బిట్ పేపరు యీజీగా ఉంటే మెయిన్ పేపరు టఫ్ఫుగా ఉంటుంది. మొత్తం మీద ఎట్టాంటోడికైనా ముప్పయి అయిదు మార్కులు వొచ్చేలా ఉంటాయి. కాబట్టి బయాలు పెట్టుకోబాకండి' అన్నాడు మా అందరికీ ధైర్నం చెప్తా.

ఆ మాటలకి మా మనసులు నిమ్మళించాయి. అంతలోనే ఒకడు 'మరి పేపర్లు ఆ మాడల్లో తయారు చేస్తే ఫెయిలు అయ్యే వాళ్లంతా ఎట్టా ఫెయిల్ అవతా ఉన్నారు సార్' అన్నాడు.

'ప్రాప్తంరా. అదీగాక ఒళ్లు కొవ్వు. రేపు పరీక్ష పెట్టుకొని యియ్యాల రాత్రి పుస్తకం పట్టే వాళ్లంతా ఎట్ట ప్యాసవుతారురా? ముందు నుంచి రొంతన్నా చదివి పెట్టుకుంటే అవుతారు గానీ. మీరు యిప్పట్నించే బాగా చదవండి. ప్యాసు గాకపోతే నన్నడగండి' అన్నాడు.

తర్వాత యింకో మాట కూడా చెప్పినాడు.

'ఒరే... మీ అమ్మలకీ అయ్యలకీ మీరు పుట్టినారు. మీరు మళ్లీ పుట్టలేరు. మీ అమ్మలూ అయ్యలూ మళ్లీ మిమ్మల్ని కనలేరు. వాళ్లకి మీరు. మీకు వాళ్లు. మధ్యలో చదువు ఉంటుంది. అది ఇంపార్టెంటని ఒప్పుకుందాముగానీ పరీక్షలు రాసి ఒకేల ఖర్మం చాలక ఫెయిలు అయినామే అనుకో అంతటితో ఏందో కొంపలు మునిగిపోయినట్టుగా పోయి రైళ్ల కింద పడబాకండి. ఇదిగాకపోతే ఇంకొకటి. ఈసారి గాకపోతే వొచ్చేసారి. మీరు ఫెయిలు అవతారని కాదుగానీ ఊరికే మాటవరసకి చెప్తా ఉన్నా. మనం చేయాల్సిన కష్టం చేద్దాం. రిజల్టు పైవాడికి ఒదిలిపెడదాం. గుడ్ అయితే గుడ్డు. బ్యాడ్ అయితే బ్యాడు. సరేనా' అన్నాడు.

'సరే సార్' అన్నాము మేము.

ఆ రోజంతా మాకు ఆ మాటలే సరిపోయినాయి.

ఆ లోపల మా కుమారస్వామి ఐవోరు నోటు పంపిచ్చి టెన్తుకిలాసు పిలకాయలంతా సాయంత్రానికి బాస్కెటుబాలు కోర్టులో హాజరుకావాలని ఆర్డరేసినాడు.

అది విని యీనేం కిలాసు పీకతాడో అని బయపడతా పోయేసరికి ఆయన మా అంద రికి వంకా చూస్తా ముసిముసిగా నవ్వతా 'ఒరే... పరీక్షల డేటు వచ్చిన సందర్భంగా గుడ్ న్యూసురా. మీ అందరికీ అంటే టెన్తు కిలాసు వాళ్లకి వచ్చే శనివారం హాలిడేరా' అన్నాడు.

దెబ్బకి పిలకాయలమందరం పెద్దగా చప్పట్లు కొట్టి 'సూపరు సార్' అన్నాం.

'అయితే ఒక చిన్న పని ఉందిరా. ఆ రోజు పొద్దున మీరంతా మీ యిళ్లల్లో ఉండి బేది మాత్ర వేసుకోవాలి. ఇది నా ఆర్డరురా' అన్నాడాయన అసలు సంగతి బయటపెట్టి మళ్లీ ముసిముసిగా నవ్వతా.

'సార్' అన్నాము మేము.

'అవునురా. సెలవు యిస్తా ఉన్నది అందుకే. ఇన్నాళ్లుగా చూస్తా ఉన్నా... పరీక్షలకి ముందరంతా కిందపడి పైన పడి బాగా చదివి కరెక్టుగా పరీక్షల టైముకి పిలకాయలు జొరాలు తెచ్చుకుంటా ఉన్నారు. అందుకని ఈ సంవచ్చరం ఈ ప్రోగ్రాము పెట్టినా. మీరంతా మస్తుగా బేదికి వేసుకొని కడుపులు ఖాళీ చేసుకున్నారంటే ఆరోగ్యాలు బాగు పడి గబక్కన జొరాలు గిరాలు రాకుండా హాయిగా పరీక్షలు రాసుకుంటార్రా' అన్నాడు.

మేమందరం మొకాలు అదోరకంగా పెట్టినాం.

ఆయన మా వంక అమ్మ కంటే దయగా చూసి 'ఒరే మీ మంచి కోరే గదరా ఈ పని చెయ్యమంటా ఉన్నది. మీరందరు గనక ఈ పని చేసినారంటే మరుసటి శనివారం మనందరం ఫేర్‌వెలు పార్టీ చేసుకుందామురా. తమాషా తమాషాగా ఎంజాయి చేద్దాము రా' అన్నాడు మా చెవుల్లో తేనెపోస్తా.

ఈసారి నిజంగానే చప్పట్లు యమా మోగిపోయినాయి.

శనివారం రోజున బేదిమాత్రల బాదలు ఏమున్నాయిగానీ ఆ మరుసటి వారం మేము చేసుకున్న ఫేర్‌వెలు పార్టీ కత అమిత కమ్మన గదా.

■